

జిల్లాలో ఎరువుల కొరత లేదు: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల కొరత లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. 'ప్రతీ రైతు తమకు కావలిసిన పరిమాణంలో ఎరువులను తీసుకోవచ్చు. 50శాతం ప్రైవేటు వర్తకులు, మరో 50శాతం సొసైటీలు లేదా రైతు సేవా కేంద్రాలకు అందజేస్తాం. ఇప్పటివరకు జిల్లాలో యూరియా 10583 ఎంటీఎస్, డీఏపీ 6402 ఎంటీఎస్, పొటాష్ 922 ఎంటీఎస్, కాంప్లెక్స్ 3084 ఎంటీఎస్, సూపర్ ఫాస్ఫేట్ 842 ఎంటీఎస్ సరఫరా చేశాం. జిల్లాలో ఎరువులను ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవు' అని స్పష్టం చేశారు.

ఉదయం మండే ఎండలు.. సాయంత్రం చిరుజల్లులు



జిల్లాలో శనివారం విచిత్ర వాతావరణం నెలకొంది. శ్రీకాకుళంలో ఉదయం ఎండల తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మధ్యాహ్న సమయంలో జాతీయ రహదారిపై ఎండ తీవ్రతకు రోడ్డుపై నీరు ప్రవహిస్తోందా? అని మన కళ్లను భ్రమింపచేసేలా ఎండమావులు కనిపించాయి. సాయంత్రం 4 గంటల తర్వాత ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. చిరుజల్లులు కురిసి.. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

- అరసవల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి)





పెండింగ్ రైల్వే పనులు పూర్తి చేయండి

- తిరుపతికి నూతన రైలు వేయండి
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
- ఉత్తరాంధ్ర రైల్వే మౌలిక వసతుల అభివృద్ధిపై ఉన్నతాధికారులతో సమీక్ష

7లో

వైసీపీ నేతల నోట కుల ప్రస్తావన

- కాళింగుల్లో ఐక్యత లేదు
- పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్

టెక్కలి, జూలై 12(ఆంధ్రజ్యోతి): 'టెక్కలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి తిలక్ మా వెలమలను తిట్టాడు. మీరు తిట్టినా మేము భరిస్తాం. మీ కాళింగుల్లో ఐక్యత లేదని మాజీ ఉపముఖ్యమంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆదిత్య కళ్యాణమండపంలో టెక్కలి నియోజకవర్గ వైసీపీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో కృష్ణదాస్ చేసిన ఈ వ్యాఖ్యలపై వెలమ, కాళింగ సామాజిక వర్గాలకు చెందిన ప్రతినిధులు ఆశ్చర్యానికి గురయ్యారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ తిలక్ మాట్లాడుతూ.. 'మీ కాళింగులకు ఓటుబ్యాంకు ఎక్కువగా ఉన్నా, తక్కువగా ఉన్న వెలమ సామాజిక వర్గం చేతిలో ఓటమి పాలవుతున్నారని గత ఎన్నికల్లో జగన్ పర్యటనలో కృష్ణదాస్ అన్నారని గుర్తుచేశారు. 'నియోజకవర్గంలో అత్యధికంగా వెలమ సామాజిక వర్గానికి చెందిన వారే ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు, ఒక ఆర్డీవో, ఒక డీఎస్పీ, ఒక విద్యుత్‌శాఖ ఏడీ.. ఇలా

(మిగతా 7వ పేజీలో..)

కొత్తూరు టు ఒడిశా

వయా మన్యం

- కడుమ మిల్లు నుంచి రేషన్ బియ్యం రవాణా
- పార్వతీపురం జిల్లాలో భారీగా పట్టుబడిన వైనం
- ప్రాథమికంగా గుర్తించిన విజిలెన్స్.. కేసు నమోదు
- నీరు గార్చేందుకు తెరవెనుక నాయకుల యత్నం

విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేయడం.. పీడీఎస్ రైస్ పట్టుకోవడం.. రెవెన్యూ శాఖకు అప్పగించడం.. ఆ వెంటనే నాయకులు రంగంలోకి దిగడం.. అధికారులపై ఒత్తిడి తేవడం.. తూతూమంత్రంగా కేసులు పెట్టడం.. అక్రమార్కులను రక్షించడం..!

..ఇదీ జిల్లాలో జరుగుతున్న తీరు. కొందరు నాయకుల అండదండలతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి.. మిల్లులో పాలిష్ చేయించి.. జిల్లా సరిహద్దులు దాటించేస్తున్నారు. దొరికితేనే దొంగలు అన్న చందంగా విజిలెన్స్ దాడులు చేసినప్పుడే పట్టుబడుతున్నారు. తాజాగా కొత్తూరు మండలంలోని ఓ మిల్లు నుంచి అక్రమంగా తరలిన బియ్యంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న చర్చ సాగుతోంది.



పి.కోనవలసలో విజిలెన్స్ అధికారులకు లారీలో పట్టుబడిన రేషన్ బియ్యం

శ్రీకాకుళం, జూలై 12(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణా జోరందుకుంది. కొంత మంది మిల్లర్లు ప్రధాన సూత్రధారులు వ్యవహరిస్తూ.. రేషన్ బియ్యం అక్రమాలకు పాల్పడుతున్నారు. తాజాగా పార్వతీపురం మన్యం జిల్లాలో విజిలెన్స్ అధికారులకు భారీగా రేషన్ బియ్యం పట్టుబడడం చర్చనీయాంశమవుతోంది. కొత్తూరు మండలం కడుమ నుంచి ఈ బియ్యం అక్రమ రవాణా సాగుతున్నట్టు అధికారులు గుర్తించడంతో అక్రమార్కుల్లో గుబులు రేగుతోంది. ప్రభుత్వం గతంలో రేషన్ కార్డుదారులకు కిలో రూపాయి చొప్పున బియ్యం అందజేసేది. కరోనావ్యాప్తి సమయం నుంచి ఒక్కో కార్డుదారుడికి ప్రతీనెలా ఐదు కిలోల చొప్పున బియ్యాన్ని

(మిగతా 7వ పేజీలో..)



700 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద శ్రీకాకుళం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం తనిఖీ నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం కడుమ నుంచి ఒడిశా రాష్ట్రం నవరంగపూర్‌కు వెళ్తున్న లారీ(ఏపీ39-యూయూ-4289)లో ఏకంగా 34,800 కిలోల పీడీఎస్ బియ్యం (700 బస్తాలు) పట్టుబడ్డాయి. వీటి విలువ రూ. 15,83,400 ఉంటుందని అధికారులు నిర్ధారించారు. కొత్తూరు మండలం కడుమలో గోవిందరావుకు చెందిన రైస్‌మిల్లు నుంచి ఈ బియ్యం సరఫరా అయినట్లు గుర్తించారు. పట్టుబడిన బియ్యాన్ని లారీతో సహా స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈసీ 6(ఏ), 7(1) సెక్షన్ కింద రైస్ మిల్లు యజమాని గోవిందరావు, లారీడ్రైవర్ మానేపల్లి వెంకటేష్‌పై కేసు నమోదు చేయాలని, వీరిపై క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్‌కు రాతపూర్వకంగా తెలియజేశారు. ఎస్ఐ రామారావు, పోలీసు కానిస్టేబుళ్లు పురుషోత్తమ్, తిరుపతిరావు, రెవెన్యూ అధికారి హేమలత, పాచిపెంట సీఎస్‌డీటీ తనిఖీల్లో పాల్గొన్నారు.

పలాస జీడి భేష్

- తమిళనాడు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేష్



ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేష్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్డీవో, జీడి పరిశ్రమల యజమానులు

పలాస, జూలై 12(ఆంధ్రజ్యోతి): 'పలాస జీడి నిర్వహణ, విధానం బాగుంది. భవిష్యత్తులో అంతర్జాతీయంగా కీర్తి గడిస్తుందన్న నమ్మకం ఉందని తమిళనాడు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ టిఎన్.వెంకటేష్ అన్నారు. శనివారం పలాసలోని పారిశ్రామికవాడలో జీడిపప్పు నిర్వహణ విధానాన్ని ఆయన పరిశీలించారు. తిరుమలతిరుపతి దేవస్థానానికి జీడిపప్పు సరఫరా చేస్తున్న ఎస్ఎస్ఎస్ ఇంటర్నేషనల్ జీడి పరిశ్రమను పరిశీలించి.. జీడిపిక్కలు బాయిలింగ్ నుంచి జీడిపప్పు ప్యాకింగ్ ఏ విధంగా జరుగుతుందో తెలుసుకున్నారు. ఇటీవల కేంద్రప్రభుత్వం జాతీయంగా పలాస జీడిపప్పును గుర్తించి ఈ నెల 14న ఢిల్లీలో అవార్డు ఇవ్వనుందని

(మిగతా 8వ పేజీలో..)



దండుగోపాలపురంలో పర్యటిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

తీరప్రాంత రహదారితో మారనున్న జిల్లా రూపురేఖలు

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

8లో

పోలీసుల పహారాలో ఫరీద్‌పేట

- బందోబస్తు నడుమ హత్యకు గురైన గోపి అంత్యక్రియలు

8లో



ఫరీద్‌పేటలో మోహరించిన పోలీసులు

బాలింతల మృతిపై విచారణ

- ఐదుగురితో కూడిన బృందం బుడితి సీహెచ్‌సీ పరిశీలన

8లో

ప్రభుత్వాసుపత్రిలో కుక్కల బెడద

- పలాస సీహెచ్‌సీలో స్వైరవిహారం
- ఇబ్బందిపడుతున్న రోగులు

హెడ్ పోస్టాఫీస్‌ల్లో సమస్యల తిష్ట



ఇచ్ఛాపురంలోని పోస్టల్ కార్యాలయం

- సిబ్బంది నిర్లక్ష్యంతో విధుల్లో జాప్యం
- మరోవైపు సాంకేతిక ఇబ్బందులు
- వినియోగదారులకు ఇక్కట్లు


ఇచ్ఛాపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): హెడ్ పోస్టాఫీసుల్లో వినియోగదారులకు సమస్యలు వెంటాడుతున్నాయి. కొంత మంది సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సేవలు సక్రమంగా అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు తప్పడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల సిబ్బంది కొరత ఉండగా.. మరికొన్నిచోట్ల సిబ్బంది బాధ్యతగా వ్యవహరించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. పోస్టాఫీసులకు ఆదరణ పెరుగుతున్నా.. వసతులు మాత్రం మెరుగుపడడం లేదని వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 3 ప్రధాన తపాలా, 64 ఉప తపాలా కార్యాలయాలున్నాయి. మరో 507 శాఖ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ప్రధాన పట్టణాల్లోని 17 పోస్టాఫీసుల్లో ఆధార్‌తోపాటు ఇతరత్రా కీలకమైన సేవలు అందిస్తున్నారు. శ్రీకాకుళం, టెక్కలి, ఆమదాలవలస, సోంపేట కార్యాలయాల్లో వేగవంతంగా పనులు అవుతున్నాయి. మిగతా కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు, ఇంటర్ నెట్ సౌకర్యం సవ్యంగా లేకపోవడం తదితర కారణాలతో

(మిగతా 7వ పేజీలో..)



ఇచ్ఛాపురం పోస్టల్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

● మూడు రోజులుగా తిరుగుతున్నా..



నా భార్య ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా పని చేస్తోంది. ఆమెకు సంబంధించిన పీఎల్ఐ కట్టేందుకు మూడు రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. కాని పని కావటం లేదు. 9న వస్తే 10న రమ్మన్నారు. 10న వస్తే నో నెట్ వర్క్ బోర్డ్ అని పెట్టారు. మళ్లీ 11న వెళ్లినా అదే పరిస్థితి. నెట్‌వర్క్ సమస్య ఉందని, పురుషోత్తపురం వెళ్లి డబ్బులు కట్టుకోండి అని సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు.

-రత్నం, ఇచ్ఛాపురం

● అవగాహన పెరగాలి

ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నాం. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవు. పోస్టల్ సేవలపై ప్రజల్లో అవగాహన పెరగాలి. ప్రభుత్వరంగ సంస్థలైన పోస్టాఫీస్, ఎల్ఐసీలో డిపాజిట్లు చేయాలి. మంచి వడ్డీతో పాటు బీమా పథకాలు సైతం వర్తిస్తాయి. ఇటీవల కేంద్ర పోస్టల్ డిపార్ట్ మెంట్ అన్నివర్గాల ప్రజలకు అందుబాటులోని పొదుపు పథకాలు తెచ్చింది.

-జ్ఞానవతి, హెడ్ పోస్టుమాస్టర్, ఇచ్ఛాపురం



శిథిలావస్థకు చేరుకున్న కల్వర్టు

శిథిలావస్థలో కల్వర్టు

- ఎప్పుడు కూలుతుందో తెలియని వైనం
- ఆందోళన చెందుతున్న 15 గ్రామాల ప్రజలు

పాత శ్రీకాకుళం, జూలై 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరం పరిధిలోని విలీన గ్రామమైన కిల్లిపాలెం సమీపంలో ఓ కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. కలెక్టర్ కార్యాలయం నుంచి కిల్లిపాలెం వెళ్లే మార్గంలో ఉన్న ఈ కల్వర్టు దశాబ్దాల కిందట నిర్మించారు. ఈ మార్గంలో సుమారు 15 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే కల్వర్టుకు ఎటువంటి నిర్వహణ లేకపోవడంతో రక్షణ గోడలు కూలి, పిచ్చి మొక్కలు పెరిగి ఎప్పుడుకూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో కిల్లిపాలెం, కళ్లేపల్లి, మొపసుబందరు, గనగళ్లవానిపేట, ఇప్పిలి, కనుగులవానిపేట, బలరాంపురం తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ద్విచక్ర వాహనాలతోపాటు ఆటోలు, ఇసుక లారీలు సైతం ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. దీంతో కల్వర్టు పూర్తిగా పాడైంది. ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పిచ్చి మొక్కలతో ఉన్న సాగునీటి కాలువ

న్యూస్ బాక్స్

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా దాసరి



దాసరి శేఖర్

ఇచ్ఛాపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కమిటీ చైర్మన్‌గా మణి చంద్ర ప్రకాష్‌ను ఇదివరకే ప్రభుత్వం ప్రకటించగా తాజాగా వైస్ చైర్మన్, కార్యవర్గ సభ్యులను నియమించింది. వైస్ చైర్మన్‌గా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు సోదరుడు దాసరి శేఖర్ నియమితులయ్యారు. డైరెక్టర్లుగా నందిగాం సరస్వతి, బృందావన్ దొళై, జి.రాజు, ఆర్.రామారావు, వి.లక్ష్మి, బి.మంగమ్మ, ఎం.అంకుల, బి.దేవరాజు, పి.శ్రావణి, డి.హేమమలత, జి.రామకృష్ణ, కె.మన్మథరావు, పి.డిల్లెమ్మలను నియమించారు. ఈ సందర్భంగా శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజును ఆ పార్టీ నేతలు అభినందించారు.

కొత్తూరు టు ఒడిశా

(ఐదో పేజీ తరువాయి)

ఉచితంగా పంపిణీ చేస్తోంది. చాలా మంది లబ్ధిదారులు సన్నబియ్యానికి అలవాటు పడి.. వీటిని వినియోగించడం లేదు. రేషన్ బియ్యాన్ని కిలో రూ.20 నుంచి రూ.22 చొప్పున వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వీటిని ఆయా వ్యాపారులు.. మిల్లర్లుకు గంపగుత్తగా మరికొంత లాభం వేసుకుని విక్రయిస్తున్నారు. ఆ చౌక బియ్యాన్ని మిల్లర్లు ఇతర రాష్ట్రాలకు పంపి.. దర్జాగా డబ్బులు సంపాదిస్తున్నారు. రెండేళ్ల కిందట ఎల్.ఎన్.పేట మండలం స్కాట్‌పేట నుంచి ఏకంగా ఆర్టీసీ పార్సిల్ వాహనంలోనే తరలిస్తున్న పీడీఎస్ రైస్‌ను విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదులో చూపించిన ఉత్సాహం.. ఆ తర్వాత ఏమైందో.. నిందితులకు శిక్ష పడిందా? లేదా అన్నదీ అధికారులు వెల్లడించడంలేదు. ఇప్పుడు పాచిపెంట మండలం పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన చౌకబియ్యం కడుమ మిల్లు నుంచి వచ్చాయని విజిలెన్స్ అధికారులే ప్రకటించారు. కాగా అసలు ఆ బియ్యం ఎక్కడ నుంచి కొనుగోలు చేశారు..? వాటిని రీసైక్లింగ్ ఎక్కడ జరిగింది..? అలాగే.. లారీతో బియ్యం తరలింపుతో మూడు రకాల బిల్లులను ఎందుకు ఇచ్చారు..? దీనివెనుక ఉన్న వ్యక్తులకు రాజకీయ నాయకులతో లింకులేమిటన్నది తేలాల్సి ఉంది. కొంతమంది మిల్లర్లు ఏ పార్టీ అధికారంలో ఉంటే వారి వెనుక ఉంటూ.. ఇటువంటి వ్యాపారాలకు తెరతీస్తున్నారు. శనివారం విజిలెన్స్ అధికారులు బియ్యాన్ని పటుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించేశారు. ఆ తర్వాత సీఎస్‌డీటీ(కొత్తూరు) ఆధ్వర్యంలో కడుమ మిల్లులో తనిఖీలు నిర్వహించారు. కొంతమంది నుంచి.. మరొక మిల్లు రెన్యువల్ ముగిసిందని.. అందుకే ఇక్కడ నుంచి పంపుతున్నామంటూ మిల్లర్లు స్టేట్‌మెంట్ ఇచ్చారు. వీటన్నింటినీ అధికారులు నమోదు చేసుకున్నారు. కానీ ఈ కేసును నీరుగార్చేందుకుగాను.. సదరు మిల్లరు బడా నాయకుల వద్దకు వెళ్లి మంతనాలు చేసినట్టు సమాచారం. జిల్లాలో అప్పుడప్పుడు రేషన్ బియ్యం భారీగా పట్టుబడటం.. ఆతర్వాత మొక్కుబడిగా విచారణ జరిగేలా.. చేయడం షరా మామూలేనన్న విమర్శలు ఉన్నాయి. తాజాగా పట్టుబడిన బియ్యం కేసు కూడా ఇలానే ఉంటుందా..? అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. పీడీఎస్ బియ్యం రవాణా సూత్రధారులపై కఠిన చర్యలుంటేనే అక్రమాలకు చెక్ పడుతుందని పలువురు భావిస్తున్నారు.

17న ఆవేటి పండుగలు

శ్రీకాకుళం కల్చరల్ జూలై 12 (ఆంధ్రజ్యోతి): పెద్ద బరాటం వారి వీధి నీలమ్మ తల్లి ఆలయంలో ఈనెల 17న ఆవేటి పండుగలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు బరాటం సాయి రాజ్ తెలిపారు. ఆరోజు నీలమ్మ తల్లికి శాకంబరిగా అలంకరిస్తామన్నారు.

పెండింగ్ రైల్వే పనులు పూర్తి చేయండి

- తిరుపతికి నూతన రైలు వేయండి
- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు
- ఉత్తరాంధ్ర రైల్వే మౌలిక వసతుల అభివృద్ధిపై ఉన్నతాధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం, జూలై 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రైల్వే పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర రైల్వే మౌలిక వసతుల అభివృద్ధిపై శనివారం వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎంతో విశాఖపట్నంలో ప్రత్యేకంగా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల రద్దీ దృష్ట్యా శ్రీకాకుళం నుంచి నేరుగా హైదరాబాద్, తిరుపతికి నూతన రైలు ఏర్పాటు చేయాలని సూచించారు. 'అమృత్ భారత్'లో నిర్వహిస్తున్న స్టేషన్ల అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. శ్రీకాకుళం, నౌపడ స్టేషన్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని.. పనుల్లో ఎటువంటి ఆలస్యం కూడదని ఆదేశించారు. రైల్వే జోన్ పనుల పురోగతిపై చర్చించారు. శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటికే మంజూరైన 18 రోడ్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. గతిశక్తి పథకం కింద నేషనల్ హైవే 16కు అనుసంధానంగా ఉన్న 'హరిశ్చంద్రపురం' రైల్వే స్టేషన్ వద్ద సరుకుల రవాణాకు ఉపయోగపడేలా లాజిస్టికల్ పార్క్ అభివృద్ధి చేయాలన్నారు. పాతపట్నం స్టేషన్‌లో రాజారాణి ఎక్స్‌ప్రెస్‌కు, పొందూరు, శ్రీకాకుళం నుంచి పూండి వరకు స్టేషన్‌లో మరిన్ని రైళ్లకు స్టాప్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లా మీదుగా పూరి-తిరుపతి, భువనేశ్వర్-విజయవాడ వందేభారత్ స్లీపర్ రైలు ప్రతిపాదనలను చేశారు. శ్రీకాకుళం జిల్లా రైల్వే అభివృద్ధికి తన వంతు బాధ్యత వహిస్తానని మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇళ్లపట్టాల అర్హుల జాబితా సిద్ధం చేయండి

- మంత్రి అచ్చెన్నాయుడు



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఇళ్ల పట్టాలు అందించేందుకు అర్హులైన లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసి, స్థలాలను గుర్తించాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో టెక్కలి, పలాస మండలాల రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం నందిగాం మండలంలో ఉన్న గృహ నిర్మాణ లే అవుట్లలో ఎంత మంది లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకున్నారు.. ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వారు ఎంతమంది అని సం బంధిత అధికారులను ప్రశ్నించారు. మండలంలోని లే అవుట్‌లో 1453 మందికి పట్టాలు ఇవ్వగా, 236 మంది లబ్ధి దారులు ఇళ్లు నిర్మించుకున్నారని, మిగిలిన 1217 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో స్థలాలు ఖాళీగా ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. సమీక్షలో టెక్కలి, పలాస ఆర్డీవోలు ఎం.కృష్ణమూర్తి, వెంకటేష్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే నిమ్మాడలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులు స్వీకరించారు. వినతులను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు సేవలందిస్తా: శివ్వాల



కొత్తకోట పీఏసీఎస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న శివ్వాల

సరుబుజ్జిలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన తనకు జిల్లా రైతులందరికీ సేవలందించే పదవి లభించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. శనివారం కొత్తకోట సహకార సంఘ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో జిల్లాలో ఎన్నో సహకార సంఘాల పాలకవర్గాలు, అధికారులు కలిసి నిధులు దుర్వినియోగానికి పాల్పడి రైతులను తప్పుదోవ పట్టించారన్నారు. డీసీసీబీ చైర్మన్‌గా కొత్తకోటతో పాటు జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌ల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సీఈవో బీవీ సన్యాసిరావు, విశ్రాంత ఎంపీడీవో మునగలవలస రవీంద్రబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు, కొత్తకోట సర్పంచ్ సురవరపు జగదీష్, టీడీపీ నాయకులు నందివాడ గోవిందరావు, కందుల వెంకటరావు మీసాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల నోట కుల ప్రస్తావన

(ఐదో పేజీ తరువాయి)

ఇతర శాఖల అధికారులు కొందరు వెలమ సామాజిక వర్గానికి చెందినవారే పని చేస్తున్నారు' అని తిలక్ అన్నారు. దీనికి మాజీమంత్రి ధర్మాన కృష్ణదాస్ స్పందిస్తూ మీరు తిట్టినా తాము భరిస్తామంటూ వ్యాఖ్యానించారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే ఎయిర్‌పోర్టు కూడా తీసుకువస్తారన్నారు. ముఖ్య నాయకులు మాట్లాడుతున్న సమయంలో పలువురు కార్యకర్తలు మెల్లగా జారుకోవడం కనిపించింది. సమావేశంలో జిల్లా పరిశీలకులు కె.రవిబాబు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జడ్పీటీసీ దువ్వాడ వాణి తదితరులు మాట్లాడారు.

పోటీతత్వాన్ని పెంచేందుకు క్రీడలు దోహదం

- ఎమ్మెల్యే గొండు శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 12(ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు క్రీడలు దోహ దం చేస్తాయని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని శాంతినగర్ కాలనీ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి బాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతోపాటు క్రీడల్లోనూ శ్రద్ధ వహించాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్పోర్ట్స్ కోటాను పెంచి క్రీడాకారులకు ఉన్నత స్థానంలో ఉంచిందన్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలకు సుమారు 400 మంది సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలో పాల్గొన్నారు. తొలిరోజు అండర్-11, 13, 15, 17, 19 బాలురు, బాలికలతోపాటు మెన్, ఉమెన్ విభాగాల్లో కూడా పోటీలు నిర్వ హించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు కె.సాగర్, ఆర్గ నైజింగ్ కార్యదర్శి నారాయణశెట్టి వెంకట కిరణ్ కుమార్, కార్యదర్శి ఎం.అశోక్ కుమార్, పూన్న కిరణ్‌కుమార్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎంవీరమణ, సీర రమణ, జి.భీమారావు, కె.రమణ, రత్నాజీ, సీఈవో సంపతిరావు సూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ప్రభుత్వం భరోసా

పాత శ్రీకాకుళం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు వివిధ రకాల పరికరాలను రాయితీపై అందించి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శనివారం మత్స్యశాఖ కార్యాలయంలో బందరువానిపేటకు చెందిన మత్స్యకారులకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద 40శాతం, జిల్లా పరిపాలన ద్వారా అదనంగా మరో 10 శాతం సబ్సిడీ కల్పించి 52 మంది మత్స్యకారులకు రూ.67,85,100 విలువైన నెట్‌లు, ఇంజన్లు పంపిణీ చేశారు. మత్స్యకారుల ముఖాల్లో చిరునవ్వు చూడడం నా జీవితంలో చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ రమణయ్య, రూరల్ టీడీపీ ప్రతినిధులు, మత్స్యకార సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చందాలు వేసుకుని మట్టి రోడ్డును వేసి..



రోడ్డును చదును చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస మునిసిపాలిటీ 18వ వార్డు పరిధిలోని కళింగనగర్‌లో స్థానికులు చందాలు వేసుకుని మట్టి రోడ్డును చదును చేశారు. కాలనీలో మౌలిక వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రోడ్డు దారుణంగా ఉండడంతో రాకపోకలకు ఇక్కట్లకు గురవుతున్నామని స్థానికులు వాపోయారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో కాలనీలో నివసిస్తున్న తామంతా చందాలు వేసుకుని శనివారం మట్టి రోడ్డును నిర్మించు కున్నామని పేర్కొన్నారు. ఎక్స్‌కవేటర్ సాయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి రోడ్డును మట్టితో చదును చేసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు విలేకరులతో మాట్లాడుతూ.. తామంతా ప్రతి సంవత్సరం అన్ని పన్నులు చెల్లిస్తున్నా మా ప్రాంత అభివృద్ధిని పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేస్తున్నా ఎవరూ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో పారిశుధ్యం, రోడ్లు, వీధిదీపాలపై మునిసి పల్ అధికారులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో పైడి రామారావు, సువ్వారి నరసింగరావు, సీపాన ఈశ్వరరావు, ఎన్.దుర్గారావు, జి.రమణమూర్తి, శ్రీనివాసరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ పోస్టాఫీస్‌ల్లో సమస్యల తిష్ఠ

(ఐదో పేజీ తరువాయి)

సక్రమంగా సేవలందడం లేదు. ఇచ్ఛాపురం తపాలాశాఖ కార్యాలయంలో వినియోగదారులకు అసౌకర్యం తప్పడం లేదు. ఆపై సిబ్బంది వ్యవహార శైలిపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్ఛాపురంలో రెండు పోస్టాఫీసులు ఉండేవి. కానీ అందులో చిన్న పోస్టాఫీసు ఎత్తివేశారు. దీంతో ఒకే ఒక్క పోస్టాఫీసు రద్దీగా మారుతోంది. వినియోగదారులకు ఆశించిన స్థాయిలో సాయం అందక గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఈ కార్యాలయంలో 3 నెలలుగా ప్రింటర్ లేదు. కొత్తగా తెచ్చిన ప్రింటర్ వారం రోజులకే మూలన పడేశారు. రెండు నెలలుగా పాస్ బుక్స్ ఇవ్వకపోవటంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. తపాలాశాఖ ద్వారా అద్భుతమైన సేవలు.. ప్రకటనలకే పరిమితం అవుతున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సేవలు మెరుగుపరచాలని కోరుతున్నారు.

ఘనంగా కల్యాణ వేంకటేశ్వరునికి పూజలు



కీర్తనలు ఆలపిస్తున్న ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం కల్చరల్ జూలై 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కలెక్టర్ బంగ్లా, నాగావళి నదీ తీరాన ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున హరినామ సంకీర్తనలతో ప్రారంభమైన కార్యక్రమాల్లో భాగంగా స్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గాయకుడు కళ్లేపల్లి ఉమామహేశ్వరరావు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. మహిళలు సామూహిక విష్ణు సహస్ర నామార్చన చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

వరుణుడి కరుణ కోసం..



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

సోంపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురవాలని వేడుకుంటూ లక్కవరం గ్రామంలో శని వారం వరుణయాగం నిర్వహించారు. శివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా మహిళలు కలశాలతో చెరువు నుంచి జలాలను తీసుకువచ్చి శివలింగానికి అభిషేకం చేశారు. అనంతరం హోమం నిర్వహించారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

నాబార్డ్ సాయంతో గ్రామాల అభివృద్ధి

బూర్జ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు నాబార్డు సంస్థ పనిచేస్తోందని పెద్దపేట ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు అన్నారు. శనివారం 44వ నాబార్డ్ దినోత్సవాన్ని పెద్దపేటలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ ఎఫ్‌పీవో కో- ఆర్డినేటర్ నూక అనూప్, మన్యం సహజ సీఈవో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఆమదాలవలస, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ తమ్మినేని శారదమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఆర్.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

సుపరిపాలనే ప్రభుత్వ లక్ష్యం

సరుబుజ్జిలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆమదాల వలస నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు టి.చంద్రశేఖర్‌యాదవ్ అన్నారు. శనివారం మర్రిపాడు గ్రామ కాలనీలో 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కందుల వెంకటరావు, మీసాల రామారావు, మీసాల అప్పలనాయుడు, జలపాల పాపారావు, ఎల్లేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిపై అన్ని పార్టీలు నిర్లక్ష్యం

- మాజీ మంత్రి ధర్మాన



మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేయడంలో అన్ని పార్టీలు అన్యాయం చేశాయని.. తాజాగా టీడీపీ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని మాజీ మంత్రి, వైసీపీ నేత ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో శని వారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నిర్వహిస్తున్న పార్టీ కార్యక్రమాల్లో క్యాడర్ అంతా పాల్గొనాలని కోరారు. వంశధార, తోటపల్లి, నారాయణపురం వంటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించిన వారు వైఎస్, జగన్ మాత్రమేనని, ఇతర పాలకులు జిల్లాపై శ్రద్ధ చూపలేదన్నారు. కూటమి కాదు.. ఇది టీడీపీ ప్రభుత్వం ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కూటమి పాలన కాదని, టీడీపీ ప్రభుత్వం మాత్రమే నని వ్యాఖ్యానించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తప్పని పరిస్థితుల్లో సీఎంను పొగడడం పనిగా పెట్టుకున్నారన్నారు. పవన్ కల్యాణ్ అమాయకుడని.. బీజేపీ కూడా టీడీపీ మేనిఫెస్టో తిరస్కరించిందని, చంద్రబాబు నాయుడు హామీలిస్తారు, వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. తాను పార్టీ మారుతానన్న ప్రచారాలను నమ్మవద్దని, ఆరోగ్యం సహకరించకపోవడం వల్లే తాను కార్యక్రమాలకు రాలేకపోతున్నానన్నారు. రాజ్యసభ, పార్లమెంటుకైనా వెళ్లేందుకు నేను సిద్ధం అని పేర్కొన్నారు. కార్యక్ర మంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్టీ సమన్వయకర్త కుంభా రవిబాబు, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, పలువురు నేతలు తదితరులు పాల్గొన్నారు.

వారు బార్ కొస్తే మాకు ఇబ్బందులే..

- దుకాణాల ఎదుటే పార్కింగ్
- ఆందోళన వ్యక్తంచేస్తున్న వ్యాపారులు

అరసవల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక అరసవల్లికి వెళ్లే మార్గంలో ఇందిరా విజ్ఞాన్ భవన్‌కు ఎదురుగా ఉన్న బార్ వల్ల తాము నిత్యం నరకాన్ని అనుభవిస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బార్ వద్ద కనీసం వాహన పార్కింగ్ కు అవకాశం లేకపోవడంతో సమీపంలో ఉన్న దుకాణాల ఎదురుగా వాహనాలను నిలిపివేస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని స్థానిక వ్యాపారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వాహనాలు గంటల తరబడి నిలిపివేస్తుండడంతో వ్యాపారాలు కూడా సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగిన స్థితిలో వారు ఏం గొడవలు చేస్తారో అని వ్యాపారులు భయాందోళన చెందుతున్నారు. బార్ యజమాని పార్కింగ్ చూపించాల్సి ఉన్నా ఆ దిశగా ఎటువంటి చర్యలు లేకపోవడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటున్నారు, పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వ్యాపారులు కోరుతున్నారు.



బార్ పక్కన షాపులకు అడ్డంగా నిలిపిన వాహనాలు

పోలీసుల పహారాలో ఫరీద్‌పేట

● బందోబస్తు నడుమ హత్యకు గురైన గోపి అంత్యక్రియలు

ఎచ్చెర్ల, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఫరీద్‌పేట గ్రామం పోలీసుల పహారాలో ఉంది. శుక్రవారం ఈ గ్రామానికి చెందిన సత్తారు గోపి హత్యకు గురైన నేపథ్యంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులను భారీగా మోహరించారు. ఫరీద్‌పేట ముఖ్య కూడలితో పాటు, నవ భారత్ ఫ్లైఓవర్, కొయ్యరాళ్ల కూడలి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో గోపి మృతదేహానికి శనివారం పోస్టుమార్టం అనంతరం గ్రామంలోని శ్మశాన వాటికలో పోలీసుల బందోబస్తు మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో సుమారు 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో సాధారణ పరిస్థితులు వచ్చేంతవరకు బందోబస్తు కొనసాగుతుందని పోలీసు వర్గాలు తెలిపాయి. గోపితోపాటు బైక్ వెనుకన కూర్చున్న సత్తారు కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు 12మందిపై కేసు నమోదు చేసి జేఆర్ పురం సీఐ ఎం.అవతారం దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. కాగా విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తదితర వైసీపీ నేతలు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

డీఆర్ వలసలో నవగ్రహ విగ్రహాల ధ్వంసం


ధ్వంసమైన నవగ్రహాల విగ్రహాలు

జి.సిగడాం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): డీఆర్ వలస శివాలయం ప్రాంగణంలోని శనీశ్వరుని ఆలయంలో గల నవగ్రహ విగ్రహాలను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు ఆలయ అర్చకుడు శనివారం ఉదయం ఆలయానికి చేరుకుని చూడగా విగ్రహాలు ధ్వంసమైనట్లు గుర్తించి గ్రామస్థులకు తెలిపాడు. వెంటనే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు చేరుకుని ఆలయాన్ని ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా పలు దేవాలయాలపై ఇటీవల కాలంలో జరుగుతున్న దాడుల నింది తులను పట్టుకోవడంలో ఎటువంటి పురగతిలేదని, హిందూ దేవాలయాలపై దాడులు చేయడం దారుణమని, తక్షణం బాధ్యులను అరెస్ట్ చేయాలని హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఎచ్చెర్ల, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఎస్ఎం పురం గ్రామానికి చెందిన ఎస్ఎం పురపు నారాయణమ్మ(72) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. నారాయణమ్మ ఏడాదిగా పక్షవాతంతో బాధపడుతూ ఎస్ఎం పురంలోని చిన్న కుమార్తె దుర్గ ఇంటి వద్ద ఉంటోంది. ఈ నెల 10న ఉదయం 11 గంటల సమయంలో ఆమె స్పృహతప్పి ఉండడాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. ఆమె పక్కనే చీమల మందు నీటిలో కలిపిన పాత్ర కనిపించింది. ఆ నీటిని తాగి ఉంటుందని భావించి వెంటనే శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఉపాధి రీత్యా అనకాపల్లిలో ఉంటున్న నారాయణమ్మ కుమారుడు లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

పాతపట్నం, జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలాంధ్రరోడ్ కూడలికి చేరువలో ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో పెద్దదేవాంగులవీధికు చెందిన వృద్ధుడు కొసమాన మోహనరావు అనే వృద్ధుడు గాయపడినట్టు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెలితే శనివారం ఇంటి రెంయి సత్యసాయి మందిరానికి వెళుతున్న మోహనరావును పాతపట్నం నుంచి పర్లాకిమిడి వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన మోహనరావుకు స్థానిక సీహెచ్‌సీలో వైద్యసేవలందించి మెరుగైన వైద్యం కోసం టెక్కలిలో గల జిల్లా ఆసుపత్రికు తరలించారు. అక్కడ కూడా వైద్య సేవలు పొంది వైద్యుల సిఫార్స్ మేరకు శ్రీకాకుళం తరలించారు. మోహనరావు కుమారుడు మల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ జి.సింహాచలం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీనియర్ న్యాయవాది ఖజాన మృతి


వెంకట్రావు(ఫైల్)

టెక్కలి, జూలై 12(ఆంధ్రజ్యోతి): టెక్కలికి చెందిన సీనియర్ న్యాయవాది ఖజాన వెంకట్రావు(75) శనివారం అనారోగ్యంతో తన నివాసంలో మృతిచెందారు. ఈయన పలు బ్యాంకులకు లీగల్ ఎడ్వైజర్‌గా పనిచేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేశారు. అలాగే టెక్కలి పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కమిటీ సభ్యులుగా వ్యవహరించారు. వెంకట్రావు మృతిపై బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు దివ్వల వివేకా నంద తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

కేఎన్‌పీఎస్ అధ్యక్షుడ్ని విడుదల చేయాలి

టెక్కలి, జూలై 12(ఆంధ్రజ్యోతి): కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్‌పై ఎన్ఐఏ అధికారులు అక్రమంగా కేసులు బనాయించి రెండేళ్లుగా ఛత్తీస్‌గఢ్ జైలులో నిర్బంధించారని, ఆయన్ను వెంటనే విడుదల చేయాలని జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం మేజర్ పంచాయతీ గొడగలవీధిలో ఈనెల 19న ఒంగోలులో జరిగే కేఎన్‌పీఎస్ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని, అందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రజల పక్షాన నిలబడి హక్కులు కోసం పోరాటం చేస్తున్న ప్రభాకర్‌ను నిర్బంధించడం సరికాదన్నారు. డీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కోత ధర్మారావు, నాయకులు కేశవరావు, కృష్ణ, రాము, సరోజిని, జానకమ్మ తదితరులు ఉన్నారు

అప్రోచ్ రోడ్డులో ఇరుక్కున్న లారీ



క్రెయిన్ సాయంతో లారీని బయటకు తీస్తున్న దృశ్యం

టెక్కలి, జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారి మెళియాపుట్టి వైపు వెళ్లే అప్రోచ్ రోడ్డులో శనివారం ఉదయం ఓ లారీ కూరుకుపోయింది. దీంతో ఈ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పలాస నుంచి మెళియాపుట్టి వైపు వెళ్లేందుకు వంతెన వద్ద లారీ తిరుగుతుండగా అప్రోచ్ రోడ్డు ప్రాంతంలో వెనుక టైర్లు దిగబడిపోయాయి. దీంతో రెండు కేన్లు సాయంతో లారీని బయటకి తీయడంతో మధ్యాహ్నానికి ట్రాఫిక్ సమస్య తీరింది. అయితే అప్రోపోచ్ రోడ్డులో నాసిరకం పనులు జరగడం వల్లే తరచూ ఇటువంటి ఘటనలు జరుగుతున్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. హైవే అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డులో పక్కాగా పనులు చేపట్టాలని కోరుతున్నారు.

సీఎం సహాయనిధి అందజేత

పాతపట్నం, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆపద సమయాల్లో ఉన్నవారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో కొత్తూరు మండలం పొన్నుటూరు గ్రామానికి చెందిన బెహరా శివకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.59,995 చెక్కును శనివారం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న శివ ఆర్థిక సాయానికి అభ్యర్థించగా ఎమ్మెల్యే చొరవతో ఈ మొత్తం మంజూరైంది.

ప్రభుత్వాసుపత్రిలో కుక్కల బెడద

● రాత్రయితే వార్డుల్లోనే స్వైరవిహారం
● ఆరు మార్గాల ద్వారా ఆసుపత్రిలోకి..
● ఇబ్బందిపడుతున్న రోగులు
● పట్టించుకోని అధికారులు
● ఇదీ పలాస సీహెచ్‌సీలో పరిస్థితి


ఆసుపత్రి ప్రాంగణంలో కుక్కల సంచారం


సగం వరకే పడుతున్న సీహెచ్‌సీ ప్రధాన ద్వారం షట్టరు

పలాస, జూలై 12(ఆంధ్రజ్యోతి): నిత్యం రోగులతో కిటకిటలాడే ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి (సీహెచ్‌సీ)లో ఊర కుక్కల బెడద అధికమైంది. రాత్రయితే చాలు వార్డుల్లో సంచరిస్తూ రోగులను, వారి బంధువులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఆసుప్రతిలోకి కుక్కలు ప్రవేశించడానికి ఆరు దారులు ఉండడంతో ఏ దారిని కూడా అరికట్టలేక సిబ్బంది చేతులు ఎత్తేస్తున్నారు. ఒక్క కాపలాదారుడితో అన్ని వైపుల నుంచి వచ్చే కుక్కలను అదుపు చేయలేకపోతున్నామని సిబ్బందే చెబుతుండడం విశేషం. ప్రధాన ద్వారాల్లోని తలుపులు, షట్టర్లు పాడైపోవడంతో వీటిని అదుపు చేయలేకపోతున్నట్టు చెబుతున్నారు. జిల్లా కేంద్రాసుపత్రి తర్వాత జిల్లాలోనే పెద్దాసుపత్రిగా గుర్తింపు పొందిన పలాస సీహెచ్‌సీలో నిత్యం రోగులు ఉంటారు. ప్రతి రోజూ ఓపీలోనే దాదాపు 200 మందికి పైగా వస్తుంటారు. రాత్రి పూట పదుల సంఖ్యలో రోగులు చికిత్స పొందుతుంటారు. కుక్కల నిర్మూలన కోసం మునిసిపల్ యంత్రాంగం చొరవ తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

అపరిశుభ్ర వాతావరణం..

వ్యర్థాలు, రోగులు వినియోగించే దుప్పట్లు వంటివి బయట పెట్టాల్సి ఉండగా ఆసుపత్రి ప్రాంగణంలోనే ఉండడం అపరిశుభ్రత నెలకొంది. దీంతో అటువైపుగా వెళ్లేవారు ముక్కున వేలువేసుకొని వెళ్లాల్సి వస్తుంది. దీనిపై ఆసుపత్రి వైద్యాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు రోగులు కోరుతున్నారు.

బాలింతల మృతిపై విచారణ

● ఐదుగురితో కూడిన వైద్య బృందం
బుడితి సీహెచ్‌సీ పరిశీలన


వైద్యాధికారులను విచారిస్తున్న ప్రత్యేక బృందం

జలుమూరు(సారవకోట), జూలై 12(ఆంధ్రజ్యోతి): బుడితి సామాజిక ఆసుపత్రిలో ఇద్దరు బాలింతలు మృతి చెందడంపై జిల్లా ప్రత్యేక వైద్యుల బృందం శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. టెక్కలి ఆసుపత్రిలో పనిచేస్తున్న జి.ప్రసునాంబ, వి.ప్రకాష్‌వర్మ, ఎం.పెస్టిబ చైతన్య, నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఎస్.శ్రీనుబాబు, జె.కాళీచరణ్‌తో కూడిన ఐదుగురు ప్రత్యేక వైద్య బృందం విచారణ చేపట్టారు. ఈనెల 7న ముగ్గురు గర్భిణులకు సిజేరియన్ చేయగా.. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో 8వ తేదీ రాత్రి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కి రిఫర్ చేయగా.. చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. అయితే వీరి మృతికి కారణాలపై దర్యాప్తు నిర్వహించారు. గర్భిణులకు శస్త్ర చికి త్స చేసిన రోజున ఎవ రెవరు వైద్యులు ఉన్నారు.. ఎటువంటి మందులు అందించారు. వంటి అంశా లపై ఆరా తీశారు. పూర్తిస్థాయిలో నివేదికను తయారుచేసి జిల్లా సామాజిక ఆసుపత్రుల సమన్వయాధికారికి, కలెక్టర్‌కు నివేదించనున్నట్టు బృందం పేర్కొంది.

పారిశ్రామికవాడలో విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

పలాస, జూలై 12(ఆంధ్రజ్యోతి): పలాస పారిశ్రామికవాడలో జీడి వ్యాపారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్య పరిష్కరిస్తామని ఆ శాఖ ఈఈ వై.యజ్ఞేశ్వరరావు తెలిపారు. శనివారం ఇంగిలిగాం పారిశ్రామికవాడలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. పారిశ్రామిక వాడలో విద్యుత్ సమస్యల వల్ల జీడి పరిశ్రమలు మూతపడుతున్నాయని, తరచూ విద్యుత్ అంత రాయం వల్ల జీడిపప్పు నిల్వ చేయడంలో ఇబ్బంది అవుతుందని వ్యాపారులు గ్రీవెన్స్ ద్వారా విద్యుత్ అధికారులకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఆ శాఖ అధికారులు జీడి వ్యాపారులతో సమావేశం నిర్వహించి పరిశ్రమలవారీగా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులు మాట్లాడుతూ విద్యుత్‌కు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, వ్యాపారులు ఆందోళన చెందవద్దని కోరారు. పారిశ్రామికవాడ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు మాట్లాడుతూ తరచూ విద్యుత్ కోతవల్ల పరిశ్రమలు తీవ్రంగా నష్టపోతున్నాయని, పారిశ్రామికవాడలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఏడీ కృష్ణమూర్తి, ఏఈ వివేక్, పారిశ్రామికవాడ ప్రధాన కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, కోశాధికారి కొంచాడ వినయ్, వ్యాపారులు టి.శ్రీను, టంకాల నాగభూషణ్ గుప్తా, పాండు రంగారావు, నవీన్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుకు భూ సేకరణ నిలిపివేయాలి


బిడిమి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

హరిపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అధికారులు చేపడుతున్న భూ సేకరణను వెంటనే నిలిపివేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమక్రసీ నాయకులు వంకల మాధవరావు, కోనారి మోహనరావు తదితరులు రాంపురం, బిడిమి గ్రామాల్లో శనివారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టు పేరుతో ఉద్దానంలో విధ్వంసం చేపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల అనుమతి లేకుండా భూముల కొలతలకు అధికారులు రావడం ఏంటని ప్రశ్నించారు. విశాఖ, ఢిల్లీ వంటి పట్టణాల్లో వందల ఎకరాల్లో ఎయిర్‌పోర్టులు ఉంటే ఇక్కడ వేలాది ఎకరాలు సేకరకణ ఎందుకని, దీనిపై కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొమర వాసు, అప్పారావు, ప్రతినిధులు పి.కుసుమ, రమేష్, తెప్పల అజయ్, కొర్ల హేమరావుచౌదరి, నీలకంఠం, పత్రి దానేసు, వెంకటరావు పాల్గొన్నారు.

రిజర్వాయర్ పూర్తి చేసేందుకు కృషి చేస్తా


బాధ్యతలు చేపట్టిన రవీంద్ర

హిరమండలం, జూలై 12(ఆంధ్రజ్యోతి): హిరమండలం వద్ద జరుగుతున్న వంశధార రిజర్వాయర్ నిర్మాణం పనులు పూర్తి చేసేందుకు తనవంతు కృషిచేస్తానని వంశధార కట్టడాల విభాగం ఈఈ బి.రవీంద్ర అన్నారు. బొబ్బిలి సర్కిల్ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చిన ఆయన శనివారం పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంశధార రిజర్వాయర్ పనులు 98 శాతం వరకు పూర్తయ్యాయని చెప్పారు. రిజర్వాయర్ పూర్తి చేసేందుకు సుమారు రూ.50 కోట్లు నిధులు మాత్రమే అవసరం ఉందని తెలిపారు. అలాగే నరసన్నపేట నిర్వహణ విభాగం ఈఈగా మురళీకృష్ణ బదిలీపై వచ్చారు.

పలాసలో కురిసిన వర్షం


పలాస -కాశీబుగ్గలో కురుస్తున్న వర్షం

పలాస రూరల్/ కాశీబుగ్గ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పలాస కాశీబుగ్గలో శనివారం ఉద యం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా సా యంత్రానికి ఒక్క సారిగా వర్షం కురవడంతో కొంత వరకు ఉపసమనం కలిగింది. గత రెండు రోజులుగా ఎండలు మండిపోతుండడంతో ప్రజలు, రైతులు ఇబ్బందిపడ్డారు. శనివారం కురిసిన వర్షంతో కాస్త ఉపశమనం పొందారు.

పోలీసు జాగిలాలతో తనిఖీలు

హరిపురం/మందస, జూలై 12(ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని మందస, హరిపురంతోపాటు పలు గ్రామాల్లోని దుకాణాల్లో ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం జాగిలాలతో తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లో గంజాయి, సారా, డ్రగ్స్ వంటి అమ్మకాలతోపాటు పాఠశాలలకు సమీపంలోని దుకాణాల్లో పాన్‌పరాగ్, ఖైనీ, గుట్కా, సిగరెట్ వంటి వాటి అమ్మకాలపై ఆరా తీశారు. వీటి అమ్మకాలు చేపడితే కఠిన చర్యలుతప్పవని హెచ్చరించారు.

బుద్ధుడి విగ్రహాల సందర్శన

సోంపేట రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): పాలవలస మెట్టపై గల గౌతమ బుద్ధుడి విగ్రహాలను శనివారం అనకాపల్లి కోపరేటివ్ సొసైటీ డిప్యూటీ రిజిస్ట్రార్ వి.తేజేశ్వరరావు, రిటైర్డు అడిషనల్ ప్రిన్సిపల్ సెక్రటరీ రట్టి మాధవరావు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. తమ వంతు కూడా ఆర్థిక సాయాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉమాపతి, గౌతమ్, గీతారాణి, నగిరి కరుణాకర్, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా కాలువ పనులు



నందిగాం, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలో గల వంశధార ప్రధాన ఎడమ కాలువతో పాటు పిల్లకాలువల అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఖరీఫ్ ప్రారంభం కావడంతో రైతాంగానికి సకాలంలో నీరు అందించాలన్న మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలతో నందిగాం, వీరభద్రాపురం, దేవళభద్ర తదితర నీటి సంఘాల ఆధ్వర్యంలో కాలువల్లో పూడికలను, గుర్రపు డెక్క తొలగింపు చకచకా జరుగుతున్నాయి. నీరు విడుదల కావడంతో సకాలంలో రైతులకు నీరందే అవకాశం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

సన్మార్గానికి దారి చూపేవే సత్సంగాలు

కోటబొమ్మాళి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కర్ని సన్మార్గంలో నడిచేందుకు ఇలాంటి సత్సంగాలు దారి చూపుతాయని ఏలూరు (మండూరు) యాజ్ఞవల్క్య ఆశ్రమానికి చెందిన శ్రీకృష్ణ శరణానందభారతి స్వామి అన్నారు. శనివారం లఖందిడ్డి గ్రామంలో గల అప్పయ్యస్వామి ఆలయంలో బమ్మిడి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన సత్సంగంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఊడికలపాడు రామకృష్ణ కరుణ గీతాశ్రయానికి చెందిన ప్రవచనకారుడు సనపల కరుణ్‌కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పశుగ్రాస వారోత్సవాలు

నందిగాం, జూలై 12(ఆంధ్రజ్యోతి): మొండ్రాయివలసలో శనివారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. నందిగాం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు పోతనపల్లి చంద్రశేఖరరావు పాల్గొని పశుగ్రాసం ప్రాముఖ్యతపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. నర్సిపురం పశువైద్యాధికారి జి.మన్మధరావు, ఎల్ఎస్ఏ శ్రీనివాసరావు, గోపాలమిత్ర రమణయ్య పాల్గొన్నారు.

● పాతపట్నం: పశుగ్రాస పెంపకాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ మంచు కరుణాకర్ అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా పెద్దలోగిడిలో పశుగ్రాస పెంపకాలపై అవగాహన శనివారం కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది నిరంజన్ రామ్మోహన్ జగదీశ్వరరావు పాడిరైతు దువ్వారి కిషోర్ పాల్గొన్నారు.


నరసన్నపేట: లచ్చుమన్నపేట ఇస్త్రీ చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


పాతపట్నం: తిడ్డిమిలో అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

జనం మెచ్చేలా కూటమి పాలన


అరసవల్లి: నగరంలో వృద్ధిరాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

రాష్ట్ర ప్రజలు మెచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన చేస్తున్నారని పలువురు ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు అన్నారు. ఈ మేరకు శనివారం వివిధ గ్రామాలు సుపరిపాలన తొలిఅడుగు కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు.

\- ఆంధ్రజ్యోతి బృందం


కొత్తూరు: కుద్దిగాంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట..

పలాస జీడి భేష్

(ఐదో పేజీ తరువాయి)

వ్యాపారులు, అధికారులు చెప్పడంతో ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో జీడి పరిశ్రమ నెలకొల్పడంపై నిర్వాహకులకు అభినందించారు. కార్మికుల వేతనాలు, జీడిపిక్కల ధరలు, కొనుగోళ్లు, విదేశీ పిక్కల వ్యవహారంపై ఆరా తీశారు. కుటీర పరిశ్రమలుగా ప్రారంభించి నేడు అంతర్జాతీయస్థాయిలో ప్రవేశించాయని జీడి పరిశ్రమల యాజమాన్యసంఘం అధ్యక్షులు మల్లా రామేశ్వరరావు, మల్లా శ్రీనివాసరావులు ఆయనకు వివరించారు. అంతకుముందు ప్రిన్సిపల్ సెక్రటరీకి ఆర్డీవో జి.వెంకటేష్, తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి, జీడి పరిశ్రమల సంఘం నేతలు సాదరంగా ఆహ్వానించారు.

తీరప్రాంత రహదారితో మారనున్న జిల్లా రూపురేఖలు

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి, జూలై 12(ఆంధ్రజ్యోతి): మూలపేట నుంచి విజయనగరం జిల్లా భోగాపురం ఎయిర్‌పోర్టు వరకు తీరప్రాంతం వెంబడి చేపట్టనున్న జాతీయ రహదారి నిర్మాణంతో జిల్లా రూపురేఖలు మారిపోతాయని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం సాయంత్రం దండుగోపాలపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూలపేట పోర్టు నిర్మాణం 70శాతం మేర పూర్తయిందని, ఇది పూర్తయితే ఉద్యోగాలు రావని దానికి అనుసంధానంగా పరిశ్రమలు ఏర్పాటు అయినప్పుడే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఇప్పటికే పలు పరిశ్రమలు ఈ ప్రాంతంతో ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థల ప్రతినిధులు ఈ ప్రాంతంలో స్థల పరిశీలన చేశాయన్నారు. ఈ నేపథ్యంలోనే మూలపేట పోర్టు నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకు తీరం వెంబడి జాతీయ రహదారి నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్‌తో కలిసి తాను కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ రహదారి నిర్మాణానికి కేంద్రం సమ్మతి తెలిపిందని, దీంతో డీపీఆర్‌ను అధికారులు సిద్ధం చేస్తున్నారన్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే తీరప్రాంతం వెంబడి వివిధ పరిశ్రమలు, హోటల్స్ ఏర్పడి పర్యాటక రంగం ఎంతో అభివృద్ధి చెంది ఎంతోమందికి ఉపాధి దొరుకుతుందన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్ఎల్ నాయుడు, అట్టాడ రాంప్రసాద్, రెడ్డి అప్పన్న బాడాన వెంకటరమణమ్మ, ఆరంగి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాతపట్నం, జూలై 12(ఆంధ్రజ్యోతి): కొత్త చంగుడి గ్రామంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు టెక్కలి ఏఈ జి.శంకరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌డీఎస్ఎస్ ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా ఏర్పడనున్న విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలన్నారు.

నిర్వాసితులకు అండగా ఉంటాం

మెళియాపుట్టి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆఫ్‌షోర్ నిర్వాసితులకు న్యాయపరమైన సహకారం అందించి అండగా ఉంటామని జనసేన పార్టీ లీగల్‌సెల్ నాయకులు వి.జ్యోతిర్మయి, జి.చంద్రమోహన్ అన్నారు. శనివారం నిర్వాసిత గ్రామానికి వచ్చి వారు బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ప్రభుత్వం రావలసిన పరిహారం న్యాయ పరంగా అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు దుక్క బాలరాజు, సర్పంచ్ ఈశ్వరరావు, వేణుగోపారావు, విజకుమార్ తదితరులు ఉన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు

పలాస, జూలై 12(ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్లపై చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు స్పష్టం చేశారు. శనివారం ఆయన మునిసిపాలిటీలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు, లేఅవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాన్లు తీసుకొనే నిర్మాణాలు చేపట్టాలన్నారు. అనుమతులు తీసుకోని నిర్మాణాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. లే అవుట్లు కూడా నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోవాలని, అనుమతులు లేనివాటిలో నిర్మాణాలు చేస్తే ప్లాన్ అప్రూవల్ ఇవ్వమన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీలో పారిశుధ్య పరిస్థితిని పరిశీలించి సిబ్బందితో పనులు చేయించారు.

శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో తమిళనాడు ప్రిన్సిపల్ సెక్రటరీ


ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న ప్రిన్సిపల్ సెక్రటరీ

జలుమూరు/మందస, జూలై 12(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలో వెలసిన శ్రీ ముఖలింగేశ్వరస్వామి వారిని తమిళనాడు ప్రిన్సిపల్ సెక్రటరీ టీఎస్ వెంకటేష్ శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో తహసీల్దారు జె.రామారావు, ఆర్ఐ కిరణ్, అర్చకులు నారాయణమూర్తి, శివ, అచ్యుత, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మందస గ్రామంలోని వాసుదేవ పెరుమాళ ఆలయాన్ని ఆయన సందర్శించారు.

పోలీసు పరీక్షల్లో భవాని ప్రతిభ

● రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు


శనాపతి భవాని

హరిపురం, జూలై12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడు దలైన ఏపీ పోలీసు కానిస్టేబుల్-2025 పరీక్ష ఫలితాల్లో మందస మండలం పిడిమందస గ్రామానికి చెందిన శనాపతి భవాని రాష్ట్రస్థాయిలో సత్తాచాటింది. మహిళా విభాగంలో 154మార్కులతో రెండో ర్యాంకు సాధించింది. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకొని తన సత్తా చాటింది. వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న శనాపతి శ్యామలరావు, భారతి కుమార్తె భవానిను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించారు. ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పరీక్షలను రాసిన భవాని కానిస్టేబుల్ పరీక్షల కోసం ఇంటివద్దనే సాధన చేసింది. గత ఏడాది స్వగ్రామానికి చెందిన గిరిబాబుతో వివాహమవ్వగా భర్త గిరిబాబు డీఎస్సీ పరీక్షలు రాశారు.

బ్రాహ్మణులను ఆదుకోవాలి

టెక్కలి, జూలై 12(ఆంధ్రజ్యోతి): సొసైటీల ద్వారా బ్రాహ్మణులకు రుణ సౌకర్యం, వివిధ పథకాలు అందించి ఆదుకోవాలని బ్రాహ్మణ సేవా సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడుగూరి రాజేష్ అన్నారు. బ్రాహ్మణులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. అలాగే అర్హులైన బ్రాహ్మణులకు ప్రభుత్వం నుంచి ఏఏ పథకాలు అందుతాయన్నది తెయజేస్తే, వాటిపై అర్హులైన బ్రాహ్మణ కుటుంబాలకు అవగాహన కల్పిస్తామన్నారు.